
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025





సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

వైద్యశాఖ నోటిఫికేషన్ రద్దేనా?

97 పోస్టుల భర్తీ ఉత్తర్వులు అటకెక్కినట్లే!

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ రద్దయినట్టేనా? అంటే అధికారుల నుంచి అవుననే సమాధానం వినిపిస్తున్నది. వైద్య ఆరోగ్యశాఖ వివిధ ప్రోగ్రాంలలో అమలులో భాగంగా పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 97 పోస్టుల భర్తీకి 2024 ఫిబ్రవరి 26న సంగారెడ్డి కలెక్టర్ ఆమోదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోటిఫికేషన్(నం.463/పీఎల్‌జీ/డీఎంఅండ్‌హెచ్‌వో/ఎస్‌ఆర్‌డి/26.2.2024) జారీ చేసింది. ఈక్రమంలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా సుమారు 3,500 పైగా దరఖాస్తులు వచ్చినట్టు ఆ శాఖ ప్రకటించింది. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ఎంఎల్‌హెచ్‌పీ, జీడీఎంవోస్, కమ్యూనిటీ నర్సు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎస్‌టీఎస్, టీబీహెచ్‌వీ, ఫార్మసిస్ట్, ఫిజిషియన్స్, డీఈఐసీ మేనేజర్, డెంటల్ టెక్నీషియన్స్, బయోకెమిస్ట్, సపోర్టింగ్ స్టాఫ్, డీఈవో, సీటీ రేడియోగ్రాఫర్ పోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టారు. అయితే నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా నియామక ప్రక్రియ ఆగుతూ సాగింది. ఏడాది కాలంగా అడపాదడపగా పలు దఫాల్లో బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్, పల్లె దవాఖానా మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్-బీఏఎంఎస్ (ఆయూష్ మెడికల్ ఆఫీసర్లు) పోస్టులు కొన్ని మాత్రమే భర్తీ చేశారే తప్ప మిగతా ఏ కేటగిరీ పోస్టు భర్తీకి చేపట్టలేదు. భర్తీ చేసిన కొన్ని పోస్టుల నియామకాల్లో కూడా రోస్టర్, మెరిట్ పాటించలేదని, అంతేకాకుండా పైరవీలకు ఆస్కారం ఇవ్వడంతో పాటు బంధుప్రీతి చూపించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఇతర అధికారుల ఒత్తిడి కారణంగా నియామక ప్రక్రియ ముందుకు సాగలేదని మరో కారణంగా తెలుస్తోంది. మరికొన్ని పోస్టులైతే ఉద్దేశపూర్వకంగానే భర్తీ చేయకుండా పక్కన పెట్టారనే వాదన వినిపిస్తున్నది. వాస్తవానికి ఏ నోటిఫికేషన్ అయినా జారీచేసిన ఏడాది లోపు పేర్కొన్న పోస్టులన్నీ భర్తీ చేయాలి. లేదంటే జారీచేసిన నోటిఫికేషన్ రద్దయినట్టే భావించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఓ సీనియర్ వైద్యాధికారి తెలిపారు. ఉన్నతాధికారులు, జిల్లా వైద్య అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఏడాది నుంచి ఎదురుచూపులే దిక్కయ్యాయని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శివశంకరీ.. శివానంద లహరి..

- జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శివరాత్రి సంగీత విభావరి
- సంగారెడ్డి గంజ్‌మైదాన్‌కు తరలివచ్చిన ప్రజలు
- గానంతో మైమరిపించిన గాయకులు మనో, ఎస్పీ శైలజ, వందేమాతరం శ్రీనివాస్, కల్పన

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని గంజిమైదాన్‌లో బుధవారం అర్ధరాత్రి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సంగీత విభావరి శివనామస్మరణతో మార్మోగింది. ప్రముఖ గాయకులు మనో, ఎస్పీ శైలజ, వందేమాతరం శ్రీనివాస్, కల్పన, అభిజ్ఞ ఆలపించిన పాటలు సభికులను మైమరిపించాయి. జబర్దస్త్ టీమ్ సభ్యులు తమ ప్రదర్శనతో నవ్వులు పూయించారు. దాదాపు పదేళ్ల తర్వాత జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని గంజిమైదాన్‌లో శివరాత్రిని పురస్కరించుకొని పూజలు చేస్తున్న జగ్గారెడ్డి



గాయనీ గాయకులతో జగ్గారెడ్డి



సంగీత విభావరికి హాజరైన ప్రజలు



ఏడుపాయలలో బండ్ల ఊరేగింపు

భక్తి నిండుగా.. బండ్ల పండుగ..

- ఏడుపాయలకు పోటెత్తిన జనం
- వనదుర్గ దర్శనానికి బారులు
- ధూంధాంగా బండ్ల ఊరేగింపు
- డప్పుల మోత, శివసత్తుల శిగాలతో మార్మోగిన ఏడుపాయల

ఏడుపాయల జాతరకు జనం పోటెత్తారు. శివరాత్రి ఉపవాసాలున్న భక్తులు వనదుర్గ సన్నిధిలో జాగారం చేశారు. గురువారం ఉదయాన్నే మంజీరాలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు ధూంధాంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది బండ్లలో ప్రజలు తరలివచ్చారు.

-పాపన్నపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)

7

పెద్దపట్నం పరవశం

- 159 మంది ఒగ్గు పూజారులు.. 46 వరుసలలో పట్నం
- తిలకించి భక్తుల తన్మయం.. సిగాలతో చిందేసిన శివసత్తులు
- మల్లన్న నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం

7



బలిహరణ అనంతరం పెద్దపట్నం తొక్కుతున్న అర్చకులు, ఒగ్గుపూజారులు



46 వరుసల్లో తీర్చిదిద్దిన పెద్ద పట్నం

పట్టభద్రులకు పట్టలే..!

75 శాతమే పోలింగ్..

ఉపాధ్యాయులు 93 శాతం

- 25 శాతం మంది గ్రాడ్యుయేట్లు డుమ్మా
- నమోదు చేసుకున్నా ఓటేయని వైనం
- ఆఖరి నిమిషం వరకు పంపకాలు!
- కేంద్రాల వద్ద హోరెత్తిన ప్రచారం
- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్
- కరీంనగర్ చేరిన బ్యాలెట్ బాక్సులు



రాయికోడ్‌లో ఓట్లు వేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న పట్టభద్రులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 27: మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రాడ్యుయేట్లకు 102, టీచర్లకు 72 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటరుగా నమోదు చేసుకున్న పట్టభద్రుల్లో నాలుగో వంతు మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఉపాధ్యాయులు సైతం సుమారు 7 శాతం ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుదారులు కేంద్రాల వద్ద ఓట్ల కోసం అభ్యర్థించారు. గ్రాడ్యుయేట్లు, టీచర్ల అభ్యర్థులకు పోటీ తీవ్రంగా ఉండడంతో పోలింగ్ ప్రక్రియ ముగిసేదాకా పలుచోట్ల పంపకాల జోరు కొనసాగింది.

తాయిలాల కోసం ఎదురుచూసి..

పట్టభద్రు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ఈసారి పెరుగుతుందనుకున్నా అంచనా తారుమారైంది. ఆరేళ్ల క్రితం నాటి ఎన్నికలతో పోల్చితే రెట్టింపు సంఖ్యలో పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నా ఓటేసేందుకు పాతిక శాతం మంది ఆసక్తి చూపలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ 70,713 మంది పట్టభద్రులు ఉండగా 55 వేల పైచిలుకు మంది మాత్రమే ఓటు వేశారు. కొంతమంది చివరివరకు తాయిలాల కోసం ఎదురుచూసినా అందకపోవడంతో ఓటు వేయనట్లుగా తెలుస్తోంది. ఇంకొందరు భారంగా భావించి ఓటుకు దూరమయ్యారు.



వీల్ చైర్‌లో పట్టభద్రుడు

ఉపాధ్యాయ ఓటర్లు మెరుగ్గా స్పందించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 7,249 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా.. 6,700 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 500 మంది ఓటేసేందుకు ఆసక్తి చూపించలేదు. అభ్యర్థులు ప్రతీ టీచర్‌ను కలిసి ఓటేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అర్హులైన ఉపాధ్యాయ ఓటర్లను కూడా గుర్తించి ఎంతోకొంత ముట్టజెప్పినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ కొందరు ఓటు వేయడానికి ముందుకు రాలేదు.

పట్టభద్రుల పోలింగ్ వివరాలు

జిల్లా పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
సిద్దిపేట	32,089	23,736	72.83
సంగారెడ్డి	25,652	18,774	73.19
మెదక్ (సా.4 వరకు)	12,472	9,387	75.26

ఉపాధ్యాయుల పోలింగ్ వివరాలు

జిల్లా పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
సిద్దిపేట	3,212	3046	94.83
సంగారెడ్డి	2,690	2,490	92.57
మెదక్ (సా.4 వరకు)	1,347	1,280	95.03

పోలింగ్ సరళిపై టెన్షన్

పోలింగ్ సరళిపై పట్టభద్రులు, ఉపాధ్యాయ అభ్యర్థులు తర్జనభర్జన

మిగతా 6వ పేజీలో



రామచంద్రాపురంలో ఓటేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి



అక్బర్‌పేటలో ఓటేసిన ఎంపీ రఘునందన్‌రావు



హుస్నాబాద్‌లో ఓటేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

వరంగల్ డాక్టర్‌పై హత్యాయత్నం భార్య పనే..!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- ఈ నెల 20న ప్రియుడు, స్నేహితుడైన ఏఆర్ కానిస్టేబుల్‌తో కలిసి దాడి
- సహకరిస్తే సంగారెడ్డిలో ఇల్లు ఇస్తానని కానిస్టేబుల్‌కు ప్రియుడి హామీ
- ప్రాణాపాయ స్థితిలో వైద్యుడు.. నిందితుల అరెస్టు

6

పట్టభద్రులకు పట్టలే..!

5వ పేజీ తరువాయి

పడుతున్నారు. మొన్నటిదాకా గెలుపు ధీమాతో ఉన్నవారు కూడా ఓటర్ల తీర్పు గుంభనంగా ఉండడంతో సంశయాత్మకంలో పడ్డారు. పట్టభద్రుల విషయానికి వస్తే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మరో అభ్యర్థి గట్టి పోటీనివ్వడంతో ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటి, ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు ఉండడం కూడా వారిని ఉత్కంఠకు గురిచేస్తోంది. అదే విధంగా ఉపాధ్యాయుల విషయానికొస్తే బీజేపీ, పీఆర్‌టీయూ అభ్యర్థులకు తోడు టీపీటీఎఫ్ అభ్యర్థి ధీమాతో ఉన్నారు. గెలుపుపై ఎవరికివారు ఆశలు పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేంద్రాలు, మండలాలు, జిల్లాల వారీగా అభ్యర్థులు అంచనాలు తయారు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఏదేమైనా మార్చి 3న ప్రారంభించే లెక్కింపుతోనే వీరి భవితవ్యాలు బయటపడనున్నాయి. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌కు తరలించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఉన్నతాధికారులు

మెదక్/సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ఆయ జిల్లాల ఉన్నతాధికారులు పరిశీలించారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 43 గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో 4.30 తరువాత కూడా పోలింగ్ కొనసాగుతోందని, 3.30 గంటల వరకు క్యూలో ఉన్నవారినేఓటు వేయడానికి అనుమతించామని తెలిపారు. సంగారెడ్డిలోని తారా కాలేజీలో, మండల కేంద్రమైన చౌటకూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ క్రాంతి సందర్శించారు.

22 కిలోమీటర్లు జాగింగ్ చేస్తూ పోలింగ్ కేంద్రానికి..



చేర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా బుధవారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడు, కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన వంగ అమరేందర్‌రెడ్డి స్వగ్రామం నుంచి కొమురవెల్లిలోని పోలింగ్ కేంద్రానికి సమీప గ్రామాల మీదుగా 22 కిలోమీటర్ల మేర జాగింగ్ చేస్తూ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.



మెదక్‌లో పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



పోలింగ్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



సిద్దిపేటలో పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

క్రైం కార్నర్

చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకుని మహిళ మృతి

సదాశివపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకుని ఓ మహిళ మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలో 65వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ గాజులరామారానికి చెందిన నడిమిదొడ్డి సామిల్ (55), ఆయన భార్య వేదమణి(45)తో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో సదాశివపేట పట్టణ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలో 65వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై వేదమణి చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకున్నది. ఆమె ఒక్కసారిగా కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో వేదమణి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడింది. భర్త సామిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

కంది, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పని మీద బయటకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన కంది మండలం పరిధిలో చోటుచేసుకున్నది. మండలంలోని కోయ్యగుండుతండా నుంచి సంగారెడ్డికి గురువారం తన బైక్‌పై వెళ్తున్న మెగావత్ కుమార్(30)ను గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. బైక్‌పై నుంచి కిందపడ్డ కుమార్‌కు తల పగిలి తీవ్రరక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు 108కు ఫోన్‌చేయడంతో అంబులెన్స్‌లో వచ్చిన వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి...

చేగుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చేగుంట మండల పరిధిలో చోటుచేసుకున్నది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమ్లా తండాకు చెందిన గుగ్లోత్‌లాలు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శంకరంపేటలో పని ముగించుకుని బైక్‌పై చేగుంటకు వస్తున్నాడు. శంకరంపేట పట్టణానికి చెందిన వేమ మణికంఠ మరొకరు చేగుంట నుంచి శంకరంపేటకు బైక్‌పై వెళ్తున్నాడు. పొలంపల్లి గ్రామ శివారులో ఈ రెండు బైకులు ఎదురుగా ఢీకొనడంతో గుగ్లోత్ లాలుకు తలకు తీవ్ర గాయాలై బాగా రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉండగా 108 అంబులెన్స్ వాహనంలో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. తీవ్ర గాయాలైన వేమ మణికంఠను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యకు గురైన మహిళ మృతదేహం లభ్యం

సదాశివపేట, ఫిబ్రవరి 27: (ఆంధ్రజ్యోతి) : హత్యకు గురైన మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం సదాశివపేట పట్టణంలో చోటుచేసుకున్నది. సీఐ మహేష్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందికంది గ్రామానికి చెందిన సార చిన్న లక్ష్మి(39) మూడురోజుల క్రితం కొండాపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో ఉంటున్న తన కూతరు వద్దకు వెళ్లి తిరిగి బుధవారం నందికంది గ్రామానికి వచ్చింది. అదేరోజు రాత్రి 10గంటల సమయంలో లక్ష్మి సదాశివపేటలో చిన్న పని ఉందని భర్త అంజయ్యకు చెప్పి వచ్చింది. అర్ధరాత్రి దాటినా తిరిగి ఇంటికి వెళ్లలేదు. గురువారం ఉదయం 8గంటల సమయంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక నిర్మానుష్య ప్రాంతంలో లక్ష్మి హత్యకు గురై పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ తలకు తీవ్రగాయాలై విగత జీవిగా పడిఉన్న మహిళ నందికంది గ్రామానికి చెందిన సార చిన్నలక్ష్మిగా గుర్తించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. మృతురాలి తమ్ముడు చెట్టుకింది మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

వరంగల్ డాక్టర్‌పై హత్యాయత్నం భార్య పనే..!

ప్రియుడు, ఓ ఏఆర్ కానిస్టేబుల్‌తో కలిసి దుశ్చర్య

కరీమాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన ఓ వైద్యుడిపై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో మిస్టరీ వీడింది. అతనిని ప్రేమించి పెళ్లాడిన భార్యే ఈ ఘాతుకానికి పాల్పడింది. ప్రభుత్వ అధ్యాపకురాలైన ఆ మహిళ తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు యత్నించింది. ఇందుకోసం ఓ ఏఆర్ కానిస్టేబుల్ సహకారం తీసుకున్నది. ఆ భర్త ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాల కోసం పోరాడుతుండగా.. భర్త ప్రాణం తీయాలని చూసిన భార్య కటకటాలపాలైంది. ఈ నెల 20వ తేదీ రాత్రి హనుమకొండ జిల్లా కాజీపేట బైపాస్ రోడ్డు భట్టుపల్లి వద్ద వైద్యుడు గాదె సుమంత్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును మిల్స్‌కాలనీ పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ గురువారం విలేకరులకు వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన డాక్టర్ గాదె సుమంత్ రెడ్డి, ఫ్లోరా మరియా 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తమ బంధువులకు చెందిన విద్యాసంస్థల వ్యవహారాలను చూసుకునేందుకు ఈ దంపతులు 2018లో సంగారెడ్డికి తమ నివాసాన్ని మార్చారు. సుమంత్‌రెడ్డి సంగారెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ అధికారిగా, ఫ్లోరా తమ బంధువుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసేవారు. అయితే, సంగారెడ్డిలో ఓ జిమ్‌లో చేరిన ఫ్లోరా.. అక్కడ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న శామ్యూల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న సుమంత్‌రెడ్డి భార్యను మందలించి.. కుటుంబాన్ని తిరిగి వరంగల్‌కు తరలించాడు. 2019లో ప్రభుత్వ అధ్యాపకురాలిగా ఉద్యోగం పొందిన ఫ్లోరా.. వరంగల్ రంగశాయిపేటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ప్రస్తుతం పని చేస్తోంది. సుమంత్‌రెడ్డి ఖాజీపేటలో సొంతంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. శామ్యూల్‌తో సంబంధాన్ని కొనసాగించిన ఫ్లోరా.. భర్త లేని సమయాల్లో శామ్యూల్‌ను సంగారెడ్డి నుంచి ఇంటికి పిలిపించేది. విషయం తెలుసుకున్న సుమంత్‌రెడ్డి భార్యను పలుమార్లు మందలించినా ఆమె పద్ధతి మార్చుకోలేదు. పైగా, తన వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్న భర్తను శామ్యూల్‌తో కలిసి చంపేందుకు సిద్ధమైంది. సుమంత్‌రెడ్డిని చంపేందుకు సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడు మంచుకూరి రాజ్‌కుమార్‌ను శామ్యూల్ సంప్రదించాడు. హత్యకు సహకరిస్తే సంగారెడ్డిలో కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని రాజ్‌కుమార్‌కు హామీ ఇచ్చాడు. దీంతో అంగీకరించిన రాజ్‌కుమార్ ఉద్యోగానికి మూడు రోజులు సెలవు పెట్టి సుమంత్‌రెడ్డి హత్యకు శామ్యూల్‌తో కలిసి రెక్కీ నిర్వహించాడు. 20న సంగారెడ్డిలో సుత్తి కొనుగోలు చేసిన వారిద్దరూ బైక్‌పై కాజీపేట చేరుకున్నారు. విధులు ముగించుకుని కారులో ఇంటికి బయలుదేరిన సుమంత్‌రెడ్డిని వెంబడించారు. వరంగల్ భట్టుపల్లి వద్ద రాత్రి తొమ్మిదన్నర గంటలప్పుడు సుమంత్‌రెడ్డి కారును అడ్డుకుని అతనిపై సుత్తితో దాడి చేశారు. సుమంత్‌రెడ్డి చనిపోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యారు. రక్తపుముడుగులో పడి ఉన్న సుమంత్‌రెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స కొనసాగుతోంది. అతని పరిస్థితి విషమంగా ఉంది. సుమంత్‌రెడ్డి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను గుర్తించారు. అయితే, నిందితులు ముగ్గురూ గురువారం కోర్టులో లొంగిపోయేందుకు వస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు అసలు విషయాన్ని బయటపెట్టారు.

చెరువులో పడి మహిళ మృతి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఓ మహిళా మృతిచెందిన సంఘటన చిన్నశంరంపేట మండలంలోని సూరారం గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల మేరకు గ్రామానికి చెందిన తొంట సావిత్రి (39) బుధవారం సాయంత్రం దుస్తులు ఉతుకడానికి పెద్ద చెరువు వద్దకు వెళ్లింది. ఉతుకుతున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి నీటిలో పడి మృతి చెందింది. సావిత్రికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడుపాయల మార్గంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొల్చారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయలకు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోతంశెట్టిపల్లి శివారులో మొదటి బ్రిడ్జి వద్ద గుర్తించారు. పంచాయతీ కార్యదర్శి అరుంధతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యక్తి వయసు 30 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉంటుందని పోలీసులు తెలిపారు. బూడిద రంగు షర్టు, చాక్లెట్ కలర్ ప్యాంటు వేసుకున్నారని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రామాయంపేటలో చిరుత కలకలం

రామాయంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట ప్రాంతంలో చిరుత కలకలం రేపుతోంది. వారం వ్యవధిలో మూడుసార్లు జంతువులపై దాడులకు తెగబడింది. బుధవారం అర్ధరాత్రి స్థానిక కొయ్యగుట్ట సమీపంలో ఓ కుక్కను చంపితిన్నది. గొల్పర్తికి చెందిన రైతు లింగం పొలం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నది. నాలుగు రోజుల కిందట కూడా ఇదే ప్రాంతంలో పశువుల పాకలో కట్టేసిన గేదెను బలిగొంది. పది రోజుల క్రితం లక్ష్మాపూర్ శివారులో పశువుల కొట్టంలో కట్టేసిన ఆవును చంపితిన్నది. ఇలా వరుస ఘటనలతో రైతులు, ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. అటవీ, పల్లె ప్రాంతాలే కాదు.. రామాయంపేట డబుల్ బెడ్ రూమ్ నివాస గృహాలకు అతి సమీపంలోని కొయ్యగుట్ట వద్ద పులి సంచారంతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. రాత్రి వేళల్లో బయటకు వచ్చేందుకే జంకుతున్నారు.

ఘనంగా యోగా శిక్షణ వార్షికోత్సవం

- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల

హుస్నాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో గురువారం ధర్మవీర్ యోగా శిక్షణ శిబిర ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల హాజరై మాట్లాడారు. క్రమం తప్పకుండా యోగా చేయడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా మహిళలు యోగాసనాలు వేశారు. యోగా గురువు అయిలేని అనిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలో వింత చేపలు

చేగుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి గ్రామ శివారులోని పెద్దచెరువులో మత్స్యకారులు గురువారం చేపల వేటకు వెళ్లారు. వలలో వింత చేపలు ప్రత్యక్షమయ్యాయి. వర్షాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి ఈ చేపలు చెరువులోకి వచ్చి ఉండవచ్చని మత్స్యకారులు పేర్కొన్నారు.





ఏడుపాయల రాజగోపురం వద్ద భక్తుల రద్దీ



ఎడ్లబండ్ల ఊరేగింపులో జనసందడి



అమ్మవారి దర్శనానికి లైన్లలో భక్తులు



గుడారాల కింద భోజనం ఆరగిస్తున్న భక్తులు



బోనాల ఊరేగింపులో చిందేస్తున్న యువత



బహుమతులను అందజేస్తున్న అదనపు కలెక్టర్

భక్తి నిండుగా..బండ్ల పండుగ

రెండో రోజూ హోరెత్తిన ఏడుపాయల జాతర

వైభవంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

ధూంధాంగా బోనాల సమర్పణ

మంజీర నదీపాయల్లో భక్తుల పుణ్యస్నానాలు



పాపన్నపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రంలో జాతర హోరెత్తింది. రెండోరోజైన గురువారం ప్రధానఘట్టమైన బండ్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. రంగురంగుల కాగితాలు, చీరలు, కొబ్బరిమట్టలు, మామిడితోరణాలు, బెలూన్లు, గుమ్మటాలతో బండ్లను చూడచక్కగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి బండ్లు ఏడుపాయల క్షేత్రానికి చేరుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు బండ్లు తిరిగే కార్యక్రమం ఆరంభమైంది. ఆనవాయితీ ప్రకారం పాపన్నపేట సంస్థానాధీశుల బండి ఏడుపాయలకు రాగా పనిబాటల వారు, ఆలయ అధికారులు స్వాగతం పలికి కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. బండ్లపై చెర్నకోలలు చేతబూని, వేపకొమ్మలను పట్టుకుని, జడలు విరబూసుకుని శివసత్తులు శిగాలు ఊగారు. డప్పుచప్పుళ్లు, చిన్నాపెద్ద చిందులతో సందడి నెలకొన్నది. రాజగోపురం వద్ద ఆలయ అధికారులు ప్రతీ బండికి కొబ్బరికాయ కొట్టి వనదుర్గామాత చిత్రపటాన్ని బహూకరించారు. జాతర రెండోరోజు వనదుర్గామాతను దర్శించుకోవడానికి వేకువజామునే భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. సప్తపాయల పొడవునా పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మను దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ ప్రాంతంలో పెద్దపెద్ద గుండ్లు, చెట్ల కింద గుడారాలు వేసుకుని విందులు చేసుకున్నారు. సాయంత్రం బండ్ల ఊరేగింపు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. జాతరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేక భక్తులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఏడుపాయల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాల ఊరేగింపు కార్యక్రమాలు కొనసాగాయి. కుండపై కుండ ఇలా నాలుగెత్తులు బోనాన్ని తలపై పేర్చి, చేతిలో చెర్నకోల పట్టుకుని డప్పుచప్పుళ్లకనుగుణంగా ఏడుపాయల ప్రాంతం నుంచి అలసట ఎరగకుండా చిందేస్తూ అమ్మవారి సన్నిధికి చేరుకుని బోనాన్ని నివేదించారు. తలనీలాలు ఇచ్చి, ఒడిబియ్యం పోసి, ముడుపులు కట్టి, తొట్టెలను సమర్పించి, మేకపోతులను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్డీవో రమాదేవి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బండ్ల ఊరేగింపులో అపశ్రుతి

బండ్లు తిరిగే క్రమంలో ఎడ్లు బెదిరి దూసుకెళ్లడంతో రామతీర్థం గ్రామానికి చెందిన దేవయ్యకు కాలువిరగగా, సార గోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి.



ఏడుపాయలలో బోనంతో చిందేస్తున్న జోగిని శ్యామల



సుంకుపడుతున్న ఒగ్గుపూజారులు



బలిహరణ అనంతరం పెద్దపట్నం తొక్కడం ప్రారంభిస్తున్న అర్చకులు, ఒగ్గుపూజారులు



చిందేస్తున్న పోతురాజులు



పెద్దపట్నంపై చిందేస్తున్న భక్తులు



భారికేడ్‌లు ఎక్కి దూసుకువస్తున్న భక్తులు



లింగోద్భవ సమయంలో గర్భాలయంలో పూజలు

పెద్దపట్నం.. పరవశం

159 మంది ఒగ్గుపూజారులు.. 46 వరుసలలో రచించిన పట్నం

తిలకించి భక్తుల తన్మయం.. సిగాలతో చిందేసిన శివసత్తులు

మల్లన్న నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం

చేర్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున కొమురవెల్లి క్షేత్రంలో మల్లన్న పెద్దపట్నం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ తోటబావి ప్రాంగణంలో యాదవ సంప్రదాయబద్ధంగా ఒగ్గుపూజారులు పట్నం రచించి, మల్లన్న కల్యాణం జరిపారు. ఆనవాయితీ ప్రకారం ముందుగా ఒగ్గు పూజారులు నిర్వహించారు. ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య నేతృత్వంలో 159 మంది ఒగ్గు పూజారులు 46 వరుసలలో పట్నాన్ని వేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సుంకు పట్టి, గొంగళిలో బియ్యం పోసి మైలపోలు తీశారు. త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పి పసుపు, కుంకుమ, తెల్లపిండి(వరిపిండి), సునేరు, పచ్చలను ప్రమద గణాలుగా సమ్మిళితం చేసి నిమ్మకాయతో చిత్రకన్ను నెలకొల్పి అష్టదిక్కులా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో బలిహరణ చేసి పెద్దపట్నంపైకి ఆవాహనం చేశారు. ఒగ్గు పూజారులు బోనాలు తీసుకువచ్చిన అనంతరం ఆదివారం తెల్లవారుజామున గర్భాలయంలో నుంచి వీరశైవార్చకులు ఉత్సవవిగ్రహాలను తీసుకువచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెందారు. పట్నం తొక్కాలన్న ఆత్రుతలో ఉన్న భక్తులు అకస్మాత్తుగా భారికేడ్‌లపై నుంచి దూకారు. లింగోద్భవ సమయంలో గర్భాలయంలో వీరశైవార్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. గురువారం ఉదయం సంప్రదాయబద్ధంగా ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు. వేడుకలలో ఆలయ ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మొక్కుబడులు, ఆర్జితసేవలు నిర్వహించడంతో పాటు ప్రసాద విక్రయాలు, వసతిగదుల అద్దె తదితరాల ద్వారా రూ.19,00,0852 బుకింగ్ ఆదాయం సమకూరింది. గతేడాది కంటే ఈసారి రూ.2.40 లక్షలు ఆదాయం పెరిగింది. ఆలయ ధర్మకర్త జయప్రకాశ్‌రెడ్డి చెప్పులు ధరించి, చేతిలో కర్ర పట్టుకుని పెద్దపట్నం వేసిన ప్రదేశంలో సంచరించడంపై భక్తులు మండిపడ్డారు.



అన్నపూజలో అలంకృతమైన శివలింగం



జాగరణ ఒక్కపొద్దులతో పట్నం తిలకిస్తున్న భక్తజనసందోహం



బీరంగూడా గుట్టపై భ్రమరాంభమల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

● కనులపండువగా భ్రమరాంభమల్లికార్జున కల్యాణోత్సవం

అమీన్‌పూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం బీరంగూడా గుట్టపై భ్రమరాంభమల్లికార్జున కల్యాణం కనులపండువగా నిర్వహించారు. శివరాత్రి మరుసటిరోజు బీరంగూడా గుట్టపై నిర్వహించే జాతరకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గుట్టకు ఎడ్లబండ్లపై వచ్చి వంటలు చేసుకుని, స్వామివారి దర్శనం చేసుకుని జాతరలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ రాజగోపురం ఎదుట మండపంలో అశేషమైన భక్తుల సమక్షంలో, వేదమంత్రోచ్చారణల మధ్య అత్యంత రమనీయంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ సుధాకర్‌యాదవ్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. గుట్టపై తాత్కాలికంగా వెలసిన మిఠాయిలు, ఆటవస్తువులు, బొమ్మల దుకాణాల్లో సందడి నెలకొన్నది.



నందివాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరస్వామి

నందివాహనంపై సంగమేశ్వరుడు

● కేతకీలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఝరాసంగం, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం సంగమేశ్వరుడికి నందివాహన సేవ నిర్వహించారు. మొదట ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల మధ్య అర్చకులు వేదామంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీ ఎదుట వీరభద్రుని వేషధారణలో దండకాలు వేస్తూ గ్రామ పుర వీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. లింగోద్భవ సమయంలో స్వామి వారికి మహానాస్య పూర్వక ఏకాదశి రుద్రభిషేకం పూజలు చేశారు. జాగరణ వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం నిత్య పూజలతో పాటు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం బారులు తీరారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ఆవరణలో పార్వతీపరమేశ్వర్ల కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివరుద్రప్ప తెలిపారు.

బ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేద్దాం

● రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు ప్రభాకరశర్మ



సమావేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు

మెదక్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ సంఘ శాశ్వత సభ్యత్వాల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి సంఘాన్ని బలోపేతం చేద్దామని రాష్ట్ర బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు వైద్య ప్రభాకరశర్మ పిలుపునిచ్చారు. గురువారం మెదక్‌లోని సత్యసాయి సేవా మందిరంలో డివిజన్‌స్థాయి సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ సంఘం ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా బ్రాహ్మణులు శాశ్వత సభ్యత్వాలు నమోదు చేసుకోవలసిందిగా సూచించారు. జిల్లా అధ్యక్షుడు కాకుల వరం వేదవ్యాస్ మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక రంగాల్లో వెనకబడి ఉన్న బ్రాహ్మణ సమాజానికి అన్ని విధాలా న్యాయం జరిగేలా పాలకులపై ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దేశాయిపేట లింగమూర్తి శర్మ, వైద్య శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ ప్రతి నెలా భవానీమాత ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా నిర్వహించే శివాభిషేకానికి ప్రతీ సభ్యుడు తప్పక హాజరై దైవ కృపకు పాత్రులు కావాలన్నారు. ఇక రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి వైద్య ప్రభాకరశర్మను అభ్యర్థిగా నిలపాలని, అదే విధంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి గౌరరాజు కాశీనాథరావును బరిలో నిలపాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో నాయకులు పోద్దార్ నరేందర్, ప్రసాద్ పంతులు, శ్రీవాండ్ల శ్రీనివాస్‌తో పాటు డివిజన్ పరిధిలోని బ్రాహ్మణులు హాజరయ్యారు.

వెంకట ఖ్వాజా.. దేదీప్యమానం

● రెండో రోజు పోటెత్తిన భక్తులు

వట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న వట్‌పల్లిలోని వెంకట ఖ్వాజా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన గురువారం లక్షదీపారాధన నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులను వెలిగించి మొక్కులను చెల్లించుకున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఈ ఉత్సవాలలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్రావు, ఖాజా ఇస్మాయిల్, రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ వెంట బీఆర్ఎస్ శ్రేణులు జైపాల్‌రెడ్డి, రజనీకాంత్, వీరారెడ్డి, శివాజీరావ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళలు





ప్రార్థనలు నిర్వహిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, గంధం తీసుకొస్తున్న అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వైక్రాంత గిరి ప్రదక్షిణకు అంకురార్పణ

● తొలిసారిగా జోగినాథ గుట్ట ప్రదక్షిణ



గోపూజ చేసి గిరి ప్రదక్షిణకు బయలు దేరుతున్న భక్తులు

జోగిపేట, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): జోగిపేట పట్టణంలో వెలసిన భక్తసులభుడు, జోడు లింగాల రూపంలో వెలసిన జోగినాథస్వామి జోగినాథ గుట్ట (వైక్రాంత గిరి) ప్రదక్షిణకు గురువారం అంకురార్పణ చేశారు. దశాబ్దాల క్రితం ఆగిపోయిన గిరి ప్రదక్షిణను శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ, శ్రీక్రిష్ణ గోశాల ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ డాకూరి శివశంకర్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి మడుపతి భద్రప్ప, గ్రామ పురోహితుడు చిదిరె రమణశర్మ నేతృత్వంలో గోపూజ చేశారు. అనంతరం జోగినాథ పల్లకీసేవ నిర్వహించారు. భక్తులందరూ సంప్రదాయ దుస్తుల్లో కాషాయ కండువాలు ధరించి జోగినాథ గుట్ట చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. గిరి ప్రదక్షిణలో ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ జాగ్రత్తలు తీసుకున్నది. అంతకుముందు జోగినాథాలయ ప్రాంగణంలో హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేందర్‌గౌడ్, హెచ్ రామాగౌడ్, పట్వారి శివశేఖర్, చింతల సురేశ్, రంగ సురేశ్, చాపల వెంకటేశం, బేలూరి రవీందర్‌గుప్తా, బస్వ శివకుమార్‌గుప్తా, ప్రేమ్ కమూర్‌గుప్తా, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఖేడ్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


చిన్నశంకరంపేటలో ఓటు హక్కును వినియోగించుకున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్


శివ్వంపేట : ఓటు వేసిన అనంతరం సిరా చుక్క చూపిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


వట్‌పల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నాయకులు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికలు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సరళి సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఆయా పోలింగ్ కేంద్రాలను కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్


మెదక్ కల్చరల్: 80 ఏళ్ల వయసులో ఎమ్మెల్సీ ఓటేసి ఆదర్శంగా నిలిచిన విశ్రాంత ఉప విద్యాధికారి కోటపాటి చౌదరి


కల్హేర్‌లో ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో వేచి ఉన్న పట్టభద్రులు


చౌటకూర్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


జహీరాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ వద్ద ఆర్డీవో రాంరెడ్డితో వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్


కోహీర్ మండలంలో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు


జిన్నారంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పార్టీ నాయకులతో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని చీమల్‌పాడ్‌కు చెందిన నీలమ్మకు వైద్యశాల ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.14,500 మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కును గురువారం ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నీలమ్మ కుటుంబీకులకు అందజేశారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా ఓంప్రకాష్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి అధ్యక్షుడిగా నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన ఓంప్రకాష్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర చైర్మన్ ఆచార్య నవోదయ సిద్ధు ఉత్తర్వులు జారీచేశారు. ఓంప్రకాష్ సామాజిక కార్యకర్తగా, రక్తదాతల గ్రూప్ సభ్యుడిగా, విద్యావేత్తగా చేస్తున్న సేవలు, కార్యక్రమాలను గుర్తించి నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనను నియమించిన నవోదయ సిద్ధుతో పాటు అందుకు కృషి చేసిన సంఘం రాష్ట్ర సమన్వయ కర్త దిగ్గేబాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొటారి నర్సింలుకు ఓంప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

జిన్నారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుమ్మడిదలలో సీజీఆర్ ట్రస్టు అధినేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు, యువజనులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్

చిన్నశంకరంపేట: మహాశివరాత్రి పురస్కరించుకొని కామాక్షి కేతకీ సంగమేశ్వర జాతరలో భాగంగా మండలంలోని రుద్రారంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎస్‌ఐ నారాయణగౌడ్ గురువారం ప్రారంభించారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ప్రజలు సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మల్లన్నస్వామిని వేడుకున్నారు. గురువారం నార్సింగి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మల్లన్న వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదవ సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డికి గొంగడి కప్పి, గొర్రెపిల్లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంగళరావు, రాజేందర్‌రెడ్డి, అంచనూరి రాజేష్, గోవర్ధన్, యాదగిరి యాదవ్, గణేష్‌యాదవ్, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌రెడ్డిని గొంగడి గొర్రెపిల్లతో సన్మానిస్తున్న యాదవ సంఘం సభ్యులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

కౌడిపల్లి/మాసాయిపేట, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 27 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ పేదల మన్ననలు పొందడమే కాకుండా.. దేశ భద్రత, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తుందనే నమ్మకంతో పట్టభద్రులు, టీచర్లు ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు ఖాజీపేట రాజేందర్, పార్టీ మండలాధ్యక్షుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని బీజేపీ మండలాధ్యక్షుడు పాపన్నగారి వేణు పేర్కొన్నారు. గురువారం మాసాయిపేట మండలంలో విలేకరులతో మాట్లాడారు.


విలేకరుల సమావేశంలో మాట్లడుతున్న మల్లేశంగౌడ్

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


బొక్కలగూడెంలో జాతరలో భక్తులు

హత్నూర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామపంచాయతీ మధిర గ్రామమైన బొక్కలగూడెం గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణం, ఒగ్గు కథ, మధ్యాహ్నం అగ్నిగుండాలు, సాయంత్రం బండ్ల ఊరేగింపు, అన్నదానం, బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో గల శివాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండరీపూర్ అంబాదాబాస్‌మహరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఎల్లమ్మ దీవెనలు ప్రజలపై ఉండాలి

● ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లమ్మతల్లి దీవెనలతో ప్రజలు సుఖ సతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రావు, నరేందర్ రెడ్డి, వేమారెడ్డి, యాదగౌడ్, గౌరీశంకర్, రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత జాతరలో ఎమ్మెల్యే

శివ్వంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో రెండురోజులపాటు దుర్గా భవానీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామదేవత దుర్గమ్మ జాతర గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉపవాస దీక్షలు విరమించిన మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు విన్యాసాలు బండ్లు, బోనాలు శివసత్తుల పూనకాలతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అంజయ్య, లక్ష్మీనరసయ్య, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనులు త్వరగా జరిగేలా చూడాలి


అక్కన్నపేట అటవీ ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న వాచ్ టవర్ పనులు పరిశీలిస్తున్న డీఎఫ్‌వో బోజి

రామాయంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట అటవీ ప్రాంతంలో జరుగుతున్న వివిధ పనులు త్వరగా జరిగేలా చూడాలని డీఎఫ్‌వో బోజి పేర్కొన్నారు. గురువారం నగర వనయోజన పథకం కింద మంజూరైన వాచ్ టవర్, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. చెట్లను అక్రమంగా ఎవరు కొట్టివేయకుండా ఎప్పటికప్పుడు అటవీ సిబ్బంది నిఘా ఉంటుందన్నారు.

గడువుతీరిన మందులు విక్రయిస్తే చర్యలు

● డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ

కౌడిపల్లి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 27 : గడువు తీరిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ హెచ్చరించారు. గురువారం 'గడువు తీరిన మందుల విక్రయం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మండలంలోని మెడికల్ షాప్‌ను తనిఖీ చేసి నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేసే సమయంలో మందుల చిటీతో పాటు బిల్లు తీసుకోవాలని సూచించారు.

లోక్ అదాలత్‌కు కేసులు వచ్చేలా కృషి చేయాలి

● జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య

నర్సాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో తక్షణమే కేసులు పరిష్కరించే అవకాశం ఉన్నందున, ఎక్కువ సంఖ్యలో కేసులు వచ్చేలా పోలీసు, ఎక్సైజ్ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ కోర్టులో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరిగేవారికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రాఘవేంద్ర, ఏజీపీ సుధాకర్, ఎక్సైజ్ సీఐ పద్మ, చిలప్‌చెడ్ ఎస్‌ఐ మిస్బోద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు


కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లిలో గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. గ్రామ శివారులోని వెంకటాపురం ఉమా సంగమేశ్వర ఆలయంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మొదటిసారి నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మల్లయోధులు పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొనగా.. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

మహిళా సాధికారత, శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, శ్రేయస్సుపై దృష్టి సారించి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని యానియన్ బ్యాంకు రీజనల్ హెడ్ తాన్య అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి పైగా విద్యార్థులు, కళాశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్యాంకు పొదుపులు, పథకాలు, సిబిల్ ప్రాముఖ్యత, డిజిటల్ చెల్లింపులు, సైబర్ మోసాలు, బ్యాంకు ఖాతా తెరవడం, ప్రధానమంత్రి బీమా పథకాలపై అవగాహన కల్పించారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు ఆలయాల్లో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులకు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వేడుకల సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే శివరాత్రి వేడుకల సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్


జహీరాబాద్ పట్టణంలోని సిద్దేశ్వరాలయం వద్ద పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


మనోరాబాద్ మండలం లింగారెడ్డిపేట్‌లోని రాజరాజేశ్వరీదేవి కల్యాణం చేస్తున్న పండితులు


చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామంలో రామలింగేశ్వరస్వామికి ఎడ్లబండ్లను ఊరేగిస్తున్న దృశ్యం